
సాక్షి
అనంతపురం
శనివారం । 16 । నవంబర్ । 2024



చీనీ టన్ను రూ.33,690

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.33,690 పలికాయి.



టమాట కిలో రూ.23

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. కనిష్టం రూ.13, సరాసరి రూ.18 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
32.5°/21.1°

జిల్లా అంతటా శుక్రవారం తుపాను వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై చాలా మండలాల్లో మోస్తరుగా వర్షపాతం నమోదైంది.

న్యూస్‌రీల్

జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్యకు అస్వస్థత



సీఈఓను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) లక్కిరెడ్డిపల్లె వెంకటసుబ్బయ్య శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి బయలుదేరి వెళ్లిన ఆయన కాసేపటికే అస్వస్థతకు గురయ్యారు. దీంతో విషయాన్ని కలెక్టర్‌కు వివరించి ఆయన సలహా మేరకు స్థానిక కార్పొరేట్ ఆస్పత్రికి సిబ్బంది తరలించారు. ఆయన్ను అత్యవసర విభాగంలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. విశ్రాంతి లేకుండా పని చేయడం, ఒత్తిడికి గురవడంతో ఇలా జరిగిందని వైద్యులు చెప్పినట్లు తెలిసింది. మెరుగైన వైద్య సేవలందించి, విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. సమాచారం తెలియగానే అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లె నుంచి సీఈఓ కుటుంబ సభ్యులు హుటాహుటిన అనంతపురం వచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ కూడా ఆస్పత్రికి చేరుకుని సీఈఓను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

'సివిల్స్'కు ఉచిత శిక్షణ



అనంతపురం రూరల్: యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించనున్నారు. ఈ మేరకు బీసీ స్టడీ సర్కిల్ డీడీ కుష్బూకొఠారి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. 27న స్క్రీనింగ్ పరీక్ష ఉంటుంది. ఇందులో ఉత్తీర్ణత సాధించిన వారికి మెరిట్ ఆధారంగా విజయవాడలో శిక్షణ అందిస్తారు. బీసీలకు 66 శాతం, ఎస్సీలకు 20, ఎస్టీలకు 14 శాతం సీట్లు కేటాయిస్తారు. పూర్తి సమాచారానికి 08554-275575, 77990 43773లో సంప్రదించవచ్చు.

వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

శింగనమల: వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.... శింగనమల మండలం నాయనవారిపల్లికి చెందిన పుల్లయ్య, జయలక్ష్మి (45) దంపతులకు ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇంటి అవసరాలు, పంటల సాగు కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద పుల్లయ్య అప్పు చేశాడు. అధిక వడ్డీల కారణంగా అప్పుల భారం పెరుగుతూ వచ్చింది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం వడ్డీ వ్యాపారులు ఇంటి వద్దకు చేరుకుని జయలక్ష్మిని దుర్భాషలాడుతూ... తీసుకున్న డబ్బు చెల్లించకపోతే బజారుకీడుస్తామంటూ బెదిరించి వెళ్లారు. దీంతో మనస్తాపం చెందిన ఆమె పురుగుల మందు తాగింది. గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే శింగనమల సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం జీజీహెచ్‌కు వైద్యులు రెఫర్ చేశారు. చికిత్సకు స్పందించక ఆమె జీజీహెచ్‌లో మృతి చెందింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వెంటాడుతున్న రక్తహీనత



- మాతృ మరణాలకు ప్రధాన కారణం రక్తహీనతే
- గ్రామీణ ప్రాంత గర్భిణుల్లో ఎక్కువగా ఇదే సమస్య
- రక్తహీనత బాధితులు 58.6 శాతం మంది
- ఆస్పత్రుల్లో సకాలంలో లభించని ఐరన్, విటమిన్ మాత్రలు
- కాన్పుల సమయంలో తీవ్ర దుష్ప్రభావం చూపుతున్నట్లు వెల్లడి

అనంతపురం జిల్లాలో ఏటా ప్రసవాలు	46,000 వరకు
శ్రీసత్యసాయి జిల్లాలో ఏటా ప్రసవాలు	39,000
తీవ్ర రక్తహీనతతో ఉన్న గర్భిణులు	40,000 పైనే
ఏటా గర్భస్థ మరణాలు	2,700 వరకు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో మహిళల్లో రక్తహీనత (ఎనీమియా) ప్రధాన సమస్యగా మారింది. ఇది నియంత్రించడం, నివారించదగ్గదే అయినా సాధ్యం కావడం లేదు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో రక్తహీనత సమస్యతో వేలాది మంది మహిళలు చాలా ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. 15 ఏళ్ల నుంచి 45 ఏళ్లలోపు మహిళల్లో ఈ లోపం ఎక్కువగా ఉన్నట్టు వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. సగటున ప్రతి వందమందిలో 58 మందికి పైగా రక్తహీనత సమస్యతో సతమతమవుతున్నారు. సరైన పౌష్టికాహారం లేకపోవడం, దీన్ని నివారించేందుకు ప్రభుత్వం నుంచి సరైన సహకారం అందకపోవడం వల్ల అనేక జబ్బులకు గురవుతున్నారు. మహిళల్లో సగటున 11 శాతం హిమోగ్లోబిన్ ఉండాలి. కానీ 25 ఏళ్ల వయసున్న మహిళల్లో హిమోగ్లోబిన్ 8 శాతం కూడా లేని పరిస్థితి. చాలామంది మహిళలు రక్తహీనత కారణంగా జబ్బులకు గురైనప్పుడు త్వరగా కోలుకోలేకపోతున్నట్టు వైద్యులు చెబుతున్నారు.

గర్భిణుల్లో ప్రమాదక పరిస్థితులు

ఉమ్మడి జిల్లాలో ఏడాదికి 80 వేలకు వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. ఇందులో 55 శాతం మందికి పైగా రక్తహీనతతోనే బాధపడుతున్నారు. సివియర్ ఎనీమియా (అత్యల్పంగా రక్తం ఉండటం) వల్ల ప్రసవ సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో ఐరన్, విటమిన్ మాత్రలు అందుబాటులో ఉండడం లేదు. యాంటీనేటల్ చెకప్ (గర్భిణిగా ఉన్నప్పుడు నెలసరి వైద్యపరీక్షలు)కు వచ్చినప్పుడు రక్తహీనత ఉన్నా...ఐరన్, విటమిన్ టాబ్లెట్లు ఇవ్వడం లేదని గర్భిణులు చెబుతున్నారు. రక్తహీనత వల్ల ఎక్కువ మంది సుఖ ప్రసవం కాలేకపోతున్నారు. అంతేకాదు ప్రసవ సమయంలో మాతృ మరణాలు చోటు చేసుకుంటున్నాయి. స్టిల్ బర్త్ (కడుపులోనే బిడ్డ మృతి చెందడం) వంటివి జరుగుతూ తల్లికీ గండంగా మారింది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో సగటున 58 శాతం మందికి పైగా గర్భిణులు రక్తహీనతతో బాధపడుతున్నట్టు తేలింది. సమయానికి ఆస్పత్రుల్లో ఐరన్, విటమిన్ మాత్రలు లభించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రక్తహీనత సంకేతాలు

- శారీరకంగా బలహీనంగా ఉండడం
- శరీరం పసుపు రంగులో ఉండడం
- శ్వాస సరిగా తీసుకోలేకపోవడం
- ఛాతీలో అప్పుడప్పుడూ నొప్పి రావడం
- అరచేతులు, అరికాళ్లు చల్లగా ఉండడం
- తరచూ తలనొప్పి వస్తుండడం

మహిళల్లో రక్తహీనత శాతం

ఉమ్మడి జిల్లా	రక్తహీనత శాతం
అనంతపురం	58.6
చిత్తూరు	48.8
కర్నూలు	54.5
వైఎస్సార్ కడప	57.7

తల్లీబిడ్డకు ప్రమాదమే



రక్తహీనతతో తల్లీబిడ్డకు ఇద్దరికీ ప్రమాదమే. గ్రామీణ ప్రాంతాల నుంచి ఇప్పటికీ రక్తహీనత కేసులు వస్తున్నాయి. రక్తహీనతతో గర్భిణికి బీపీ ఎక్కువై పుట్టే పిల్లల్లో ఎదుగుదల ఉండదు. గర్భం దాల్చినప్పటి నుంచి గైనకాలజిస్టును సంప్రదించి వైద్యం చేయించుకోవాలి.
– డాక్టర్ మల్లిక, గైనకాలజిస్ట్, సర్వజనాస్పత్రి

జిల్లా అంతటా వర్షం



అనంతపురంలో వర్షానికి జలమయమైన అంబేడ్కర్ ఫ్లై ఓవర్ ప్రాంతం

అనంతపురం అగ్రికల్చర్: అల్పపీడనం ప్రభావంతో జిల్లా అంతటా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు 11.8 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. పుట్లూరు, యల్లనూరు, అనంతపురం, శింగనమల, ఆత్మకూరు మండలాల్లో 20 మి.మీకి పైగా వర్షం కురిసింది. రాయదుర్గం, ఉరవకొండ, బుక్కరాయసముద్రం, డి.హీరేహాళ్, నార్పల, తాడిపత్రి, గుమ్మఘట్ట, గుంతకల్లు, శెట్టూరు, కళ్యాణదుర్గం, విడపనకల్లు, రాప్తాడు, బెళుగుప్ప, గార్లదిన్నె, కుందుర్పి మండలాల్లో 10 మి.మీ పైగా నమోదైంది. మిగతా మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రెయినేజీలు పొంగిపొర్లాయి. ఈ వర్షాలకు బుక్కరాయసముద్రం, పుట్లూరు, యల్లనూరు, శింగనమల, కళ్యాణదుర్గం, కూడేరు, రాప్తాడు ప్రాంతాల్లో వరి, వేరుశనగ, పప్పుశనగ, పత్తి, అరటి, చామంతి తదితర పంటలు దెబ్బతిన్నాయి. లక్ష హెక్టార్ల భారీ విస్తీర్ణంలో సాగు చేసిన కంది పరిస్థితి ఆశాజనకంగా ఉండగా.. ఈ వర్షాలు, మేఘాలు ఆవరించడం వల్ల దిగుబడులు తగ్గే అవకాశం ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురు, శుక్రవారాల్లో కురిసిన వర్షాలకు రూ.3.50 కోట్ల మేర పంటనష్టం వాటిల్లినట్లు వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనాలు వేశారు.



అనంతపురంలో ఇళ్లముందు మురుగు తొలగిస్తున్న దృశ్యం

పకడ్బందీగా 'మిషన్ శక్తి' అమలు



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

అనంతపురం అర్బన్: ఆడపిల్లలు, మహిళల రక్షణ, భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మిషన్ శక్తి' పథకం పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో 'మిషన్ శక్తి' జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'మిషన్ శక్తి' పథకం 2025–26 వరకు 15వ ఆర్థిక సంఘం పరిధిలో అమలు కానుందన్నారు. పథకానికి సంబంధించి జిల్లా, బ్లాక్, గ్రామ పంచాయతీ, మునిసిపల్ వార్డుల వార్షిక కార్యాచరణ ప్రణాళికను జిల్లా కమిటీ సిద్ధం చేసుకోవాలని చెప్పారు. ప్రతి మూడు నెలకు ఒకసారి సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. హింసకు గురైన, గురవుతన్న మహిళలు, సహాయం అవసరమైన మహిళలకు పునరావాసం, భద్రతను పథకం ద్వారా కల్పించాలన్నారు. అనంతరం 'మిషన్ శక్తి' పోస్టర్లను కలెక్టర్, అధికారులు విడుదల చేశారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీఎంహెచ్ఓ ఈబీ దేవి, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ రసూల్, డీపీఈఓ వెంకటరమణనాయక్, డీఐపీఆర్ఓ గురుస్వామిశెట్టి, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాప్‌రెడ్డి, మైనారిటీ సంక్షేమాధికారి రామసుబ్బారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

యువత.. మత్తుకు బానిస కారాదు

అనంతపురం అర్బన్: యువత మత్తు, మాదకద్రవ్యాలకు బానిసకాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ పి.జగదీష్‌తో కలిసి ఆయన నార్కో కో–ఆర్డినేషన్ కమిటీ జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌తో మాట్లాడుతూ యువత మత్తుకు బానిసైతే భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. మాదద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఔషధ దుకాణాల్లో వైద్యుని ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మాత్రలు ఇవ్వకుండా చూడాలన్నారు. ప్రతి ఔషధ దుకాణంలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. జిలాలోకి గంజాయి, తదితర మాదక ద్రవ్యాలు రవాణా కాకుండా గట్టి నిఘా ఉంచాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు బిర్సా ముండా

అనంతపురం అర్బన్: భగవాన్ బిర్సా ముండా భూహక్కుల పోరాటయోధుడని కలెక్టర్ వినోద్‌కుమార్ కొనియాడారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో బిర్సాముండా 150వ జయంత్యుత్సవం నిర్వహించారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై బిర్సా ముండా, అల్లూరి సీతారామరాజు చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. భగవాన్ బిర్సా ముండా జయంతి సందర్భంగా ధర్తీ ఆబా జంజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. జిల్లాలో గుంతకల్లు మండలం గుండాల తండా, వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి, శింగనమల మండల చిన్నవరం గ్రామాలను పథకం కింద ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో నృత్య ప్రదర్శనలతో అలరించిన చిన్నారులకు కలెక్టర్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఆర్ఓ ఎ.మలోల, డీటీడబ్ల్యూఓ రామాంజినేయులు, ఇతర అధికారులు, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తాగినోళ్లకు తాగినంత!

- కొత్త మద్యం పాలసీ వచ్చి 30 రోజులు పూర్తి
- ఉమ్మడి జిల్లాలో షాపులకు రూ.178.5 కోట్ల మద్యం సరఫరా
- ఉమ్మడి జిల్లాలో రూ.116 కోట్ల సరుకు విక్రయం
- ఊరూరా నిషాలో ముంచెత్తిన కూటమి సర్కారు



మద్యం విక్రయ వివరాలు

ఉమ్మడి జిల్లాలో షాపులకు మద్యం సరఫరా	2,31,161 కేస్‌లు
వీటిని లీటర్లలో చూస్తే	20,80,449
దీని విలువ	రూ.178.5 కోట్లు
వినియోగమైన మద్యం (లీటర్లలో)	13,52,296
దీని విలువ	రూ.116 కోట్లు
బీర్ల అమ్మకాలు	76,843 కేస్‌లు
బార్ అండ్ రెస్టారెంట్లలో అమ్మకాల విలువ	రూ.15 కోట్లు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పల్లెలు నెల రోజులుగా మత్తులో జోగుతున్నాయి. కూటమి సర్కారు పుణ్యమా అని కిరాణా షాపుల తరహాలో ఊరూరా బెల్టుషాపులు వచ్చాయి. నాలుగడుగులు వేస్తే చాలు మందుబాటిల్ దొరుకుతోంది. దీంతో సామాన్యులు సంపాదించిన సొమ్మంతా మద్యానికే ఖర్చు చేస్తున్నారు. గతంలో బహిరంగ మద్యపానం, బెల్టుషాపుల రద్దు వంటివాటితో మద్యం పూర్తిగా నియంత్రణలో ఉండేది. ఇప్పుడు మారుమూల గ్రామాల్లోనూ ఏరులై పారుతోంది. మద్యం నిషా కారణంగా గ్రామాల్లో మళ్లీ గొడవలు రాజుకుంటున్నాయి. మద్యం మత్తులో ద్విచక్ర వాహనాల ప్రమాదాలు పెరుగుతున్నాయి.

30 రోజుల్లో రూ.178.5 కోట్లు

కూటమి సర్కారు అక్టోబర్ 15న కొత్త మద్యం పాలసీ తెచ్చింది. అప్పటినుంచి నవంబర్ 15వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాలోని 63 మండలాల్లో రూ.178.5 కోట్ల విలువైన మద్యాన్ని వైన్ షాపులకు విక్రయించారు. ఈ షాపుల్లో 90 శాతం టీడీపీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో నడుస్తున్నవే. నాణ్యమైన మద్యం అని ప్రకటించినా ఎక్కడా అందుబాటులో లేదు. ధరలు తగ్గిస్తామని చెప్పినా అమలు కాలేదు. లూజు విక్రయాలు ఉండవని చెప్పినా జిల్లా వ్యాప్తంగా 300కు పైగా బెల్టుషాపులు ఏర్పాటయ్యాయి. కార్యకర్తలకు ఉపాధి పేరుతో ఒక్కో ఊర్లో ముగ్గురు లేదా నలుగురికి బెల్టుషాపులు కట్టబెట్టి రేయింబవళ్లు అమ్మకాలు సాగిస్తూ పచ్చటి పల్లెలను మత్తులో జోగేలా చేశారు.

గంటకు 1,878 లీటర్ల వినియోగం

తాజా గణాంకాలను బట్టి గడిచిన నెల రోజుల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20,80,449 లీటర్ల మద్యం వినియోగమైంది. అంటే గంటకు 1,878 లీటర్ల మద్యం అన్నమాట. సర్కారు.. షాపులకు విక్రయించిన మద్యంలో 65 శాతం అంటే నెలరోజులకు 13.52 లక్షల లీటర్ల మద్యం వినియోగమైంది. 35 శాతం స్టాకు షాపుల్లో ఉంది. ఇప్పటివరకు విక్రయించిన మద్యం ఖరీదు రూ.116 కోట్లుగా ఉంది. బార్లలో వినియోగమయ్యే మద్యం దీనికి అదనం. ఇప్పటివరకు జరిగిన మద్యం వినియోగంలో అనంతపురం జిల్లాలో అనంతపురం నగరంలో అత్యధికంగా రూ.39 కోట్లు కాగా, శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గంలో రూ.15.50 కోట్ల మద్యం వినియోగమైంది. తాడిపత్రిలో రాజకీయాల నేపథ్యంలో నాలుగు షాపులు ఇంకా తెరవనే లేదు. బెల్టుషాపులు, హోటళ్లు, దాబాల్లో విక్రయాలు ఊపందుకున్నాయి.

అమరనాథరెడ్డి ఇంటికి విశాఖ పోలీసులు

కదిరి అర్బన్: మండల పరిధిలోని వీరచిన్నయ్యగారిపల్లికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మలక అమరనాథ్‌రెడ్డి ఇంటికి శుక్రవారం విశాఖ పోలీసులు వచ్చారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఫేస్‌బుక్‌లో పోస్ట్ పెట్టాడన్న కారణంగా విశాఖపట్నం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో అమరనాథ్‌రెడ్డిని విచారించేందుకు ఇక్కడికి వచ్చారు. అమరనాథ్‌రెడ్డి, అతని కుటుంబ సభ్యులు ఎవరూ ఇంట్లో లేకపోవడంతో గేటుకు నోటీసులు అతికించి వెళ్లారు. ఇప్పటికే అమరనాథ్‌రెడ్డిపై మూడు కేసులుండగా ఇది నాలుగో కేసు.

నిలకడగా ఎండు మిర్చి ధరలు

హిందూపురం అర్బన్: హిందూపురం వ్యవసాయ మార్కెట్‌లో ఎండు మిర్చి ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. మార్కెట్‌కు శుక్రవారం 200 క్వింటాళ్ల ఎండు మిర్చి రాగా.. మొదటి రకం క్వింటా రూ. 18 వేలు, రెండో రకం రూ.8 వేలు, మూడో రకం 7 వేలు పలికాయి. వాతావరణ మార్పుతో ఎండిన సరుకు మార్కెట్‌కు రావడం తక్కువైందని మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. రైతులు బాగా ఎండించిన సరుకు తీసుకువస్తేనే మంచి ధరలు లభిస్తాయన్నారు.

కార్తీక దీపం .. తేజోమయం



అనంతపురం మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



అనంతపురంలోని హెచ్చెల్సీ నీటిలో భక్తులు వదిలిన దీపాలు

కార్తీక పౌర్ణమి వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాలతో పాటు వివిధ ఆలయాల ప్రాంగణాలు దీపాలు, జ్వాలా తోరణాలతో తేజోమయంగా వెలుగొందాయి. మహిళలు ఆలయ ప్రాంగణాల్లో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే నీళ్లలో దీపాలు వదిలి ఆరాధించారు. – అనంతపురం కల్చరల్:

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా సాకే చంద్ర



అనంతపురం కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా అనంతపురం 33వ డివిజన్ కార్పొరేటర్ సాకే చంద్రశేఖర్ నియమితులయ్యారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియామక ఉత్తర్వులను కేంద్ర కార్యాలయం శుక్రవారం అందజేసింది. ఈ మేరకు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేసింది. సాకే చంద్ర పార్టీ అనుబంధ కమిటీల నియామకం, అనుబంధ విభాగాల కార్యక్రమాల సమన్వయ బాధ్యతలు నిర్వర్తిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొంది. తనపై నమ్మకం ఉంచి అవకాశం కల్పించిన మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డికి సాకే చంద్ర కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

క్లుప్తంగా

అందుబాటులో యూరియా గోల్డ్


యూరియా గోల్డ్ బస్తా పరిశీలిస్తున్న ఏడీఏ రవి

అనంతపురం అగ్రికల్చర్: పంటల సాగులో రైతులకు బాగా ఉపయోగపడే 'యూరియా గోల్డ్' అందుబాటులోకి వచ్చినట్లు వ్యవసాయశాఖ ఏడీ ఎం.రవి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 40 కిలోల బస్తా ధర రూ.266గా పేర్కొన్నారు. ప్రస్తుతం వాడకలో ఉన్న యూరియాలో 46 శాతం నైట్రోజన్ పోషకం ఒక్కటి మాత్రమే ఉంటుందన్నారు. అయితే యూరియా గోల్డ్‌లో 37 శాతం నైట్రోజన్, 17 శాతం సల్ఫర్ (గంధకం) పోషకం ఉంటుందన్నారు. సల్ఫర్ తక్కువగా ఉన్న నేలలకు ఇది చాలా అనుకూలమని తెలిపారు. నైట్రోజన్ పోషకాన్ని సల్ఫర్‌తో జత చేసినందున స్థిరంగా ఉంటూ పంటలకు ద్వంద్వ ప్రయోజనకారిగా పనిచేస్తూ దిగుబడుల పరంగా మేలు జరుగుతుందని వివరించారు. ఆర్‌సీఎఫ్ కంపెనీ నుంచి ఇటీవల జిల్లాకు కొంత మోతాదులో గోల్డ్ యూరియా వచ్చిందని, రాగల రోజుల్లో పెద్ద ఎత్తున సరఫరా అయ్యే అవకాశముందన్నారు.

లైఫ్ సర్టిఫికెట్లు అందజేయండి

అనంతపురం క్రైం: ఆర్టీసీలో ఉద్యోగ విరమణ పొందిన వారు 2025 సంవత్సరానికి సంబంధించి పెన్షన్ పొందేందుకు ఈ నెల 30వ తేదీ లోపు లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి. ఈ మేరకు ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం నేతలు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అనంతపురం ఆర్టీసీ డిపోలోని విశ్రాంత ఉద్యోగ సంఘం సభ్యుల వద్ద లైఫ్ సర్టిఫికెట్లను ఉచితంగా పొందవచ్చునన్నారు. వీటిని భర్తీ చేసిన అనంతరం డిపో మేనేజర్ సంతకం చేయించి తిరిగి సంఘం సభ్యులకు అందజేస్తే నిర్ణీత గడువు లోపు వాటిని విజయవాడలోని ప్రధాన కార్యాలయానికి చేరుస్తామని పేర్కొన్నారు.

రేపు పంపనూరులో కోటి దీపోత్సవం


సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మూలవిరాట్

ఆత్మకూరు: ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర క్షేత్రంలో ఈ నెల 17న కోటి దీపోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ బాబు శుక్రవారం తెలిపారు. ఆదివారం ఉదయం ఆలయంలో పంచామృతాభిషేకాలతో పాటు, తులసీదామోదర కల్యాణోత్సవం ఉంటుంది. సాయంత్రం ఆలయంలో విశేష హారతులు, జ్వాలా తోరణంతో పాటు కోటి దీపోత్సవం నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ఉత్సవంలో పాల్గొనేందుకు వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా పటిష్ట ఏర్పాట్లు చేశారు. తాగునీరు, వైద్య శిబిరాలను అందుబాటులో ఉంచనున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు రాత్రి సమయాల్లో ఇబ్బంది పడకుండా ప్రత్యేక బస్సులనూ ఏర్పాటు చేశారు.

కర్ణాటక తొలి విజయం

- సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం
- పేలవమైన ఆట తీరుతో చతికిలబడిన ఆంధ్ర


టోర్నీ ప్రారంభోత్సవంలో ఏపీ, కర్ణాటక జట్ల క్రీడాకారులతో ముఖ్యఅతిథులు


గోల్ పోస్టు వద్ద ఆంధ్ర స్ట్రైకర్ల నుంచి బంతిని తరలించుకెళుతున్న కర్ణాటక డిఫెండర్

అనంతపురం: సంతోష్ ట్రోఫీ తాజా సీజన్‌లో కర్ణాటక, తమిళనాడు జట్లు తొలి విజయం నమోదు చేసుకున్నాయి. శుక్రవారం అనంత క్రీడాగ్రామం వేదికగా జరిగిన ప్రారంభ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టుపై 5–0 గోల్స్ తేడాతో కర్ణాటక జట్టు భారీ విజయాన్ని నమోదు చేయగా... రెండో మ్యాచ్‌లో అండమాన్ నికోబార్ జట్టుపై 7–0 గోల్స్ తేడాతో తమిళనాడు జట్టు గెలుపొందింది. జోరున కురుస్తున్న వర్షంలోనే మ్యాచ్‌లు హోరాహోరీగా సాగడం గమనార్హం.

చెలరేగిన కన్నడిగులు

ప్రత్యర్థి డిఫెన్స్ బలహీనతలను సొమ్ము చేసుకుంటూ కర్ణాటక జట్టు క్రీడాకారులు చెలరేగిపోయారు. ఆట ప్రారంభమైన తొలి 15 నిమిషాల వ్యవధిలోనే ఆంధ్ర జట్టుపై మూడు గోల్స్ చేసి ఆధిక్యతలో కొనసాగారు. దీంతో ఒత్తిడికి గురైన ఆంధ్ర క్రీడాకారులు కేవలం డిఫెన్స్‌కే పరిమితమవుతూ వచ్చారు. బంతిని ఎక్కువ సేపు అదుపులో పెట్టుకున్నా... అవి గోల్ కాకుండా కర్ణాటక క్రీడాకారులు అడ్డుకోవడం గమనార్హం. అనూహ్యంగా దక్కిన కార్నర్‌లు, ఆఫ్‌సైడ్‌లను సద్వినియోగం చేసుకోలేక చతికిలబడ్డారు. దీంతో రెండో హాఫ్‌లో మరో రెండు గోల్స్ చేసి కర్ణాటక శుభారంభం చేసింది.

తమిళుల ధాటికి తాళలేక...

రెండో మ్యాచ్‌లో తమిళనాడు జట్టు ముందు పేలవమైన ఆటతీరుతో అండమాన్ నికోబార్ జట్టు చతికిలబడింది. ఆట ప్రారంభం నుంచి అండమాన్ నికోబార్ జట్టుపై తమిళనాడు క్రీడాకారులు ఆధిక్యతను కొనసాగిస్తూ 7–0 గోల్స్ తేడాతో భారీ విజయాన్ని నమోదు చేశారు. అనంత క్రీడాగ్రామంలోని ఫుట్‌బాల్ స్టేడియంలో ఈ సీజన్‌కు ఇదే భారీ విజయం కావడం విశేషం.

ఏపీలో ఫుట్‌బాల్ అభివృద్ధికి సహకారం

ప్రపంచంలో ఫుట్‌బాల్ క్రీడకు విపరీతమైన క్రేజ్ ఉందని జాతీయ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కళ్యాణ్ చౌబే అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ (ఏపీఎఫ్‌ఏ) ఆధ్వర్యంలో అనంత క్రీడాగ్రామం వేదికగా ఆర్డీటీ స్టేడియంలో సంతోష్ ట్రోఫీ–24 శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. కళ్యాణ్ చౌబే, జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డేనియల్ ప్రదీప్, ఆర్డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరై టోర్నీని ప్రారంభించారు. కళ్యాణ్ చౌబే మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లో ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. జేసీ శివనారాయణ శర్మ మాట్లాడుతూ.. సంతోష్ ట్రోఫీ టోర్నీని జిల్లాలో నిర్వహించడం గర్వకారణమన్నారు.

మజ్దూర్ యూనియన్ విస్తృత ప్రచారం

గుత్తి: రైల్వే కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. శుక్రవారం ఉదయం గుత్తి ఆర్‌ఎస్‌లో మజ్దూర్ యూనియన్ దక్షిణ మధ్య రైల్వే జనరల్ సెక్రెటరీ సీహెచ్ శంకరరావు పర్యటించారు. డిసెంబర్ 4, 5 తేదీల్లో జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ జెండా గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలన్నా, ఓపీఎస్ అమలు కావాలన్నా మజ్దూర్ యూనియన్‌తోనే సాధ్యమవుతుందన్నారు. అంతకు ముందు రైల్వే కార్మికులు, మజ్దూర్ యూనియన్ నాయకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రెటరీ విజయకుమార్, కోశాధికారి శర్మ, ఏడీఎస్ నారాయణ, యూనియన్ నాయకులు శేఖర్‌బాబు, రామాంజుల రెడ్డి, మనోహర్, నరసింహ, సుధీర్, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారి ఇంట్లో రేషన్ బియ్యం డంప్


ఇంట్లో నిల్వ ఉంచిన బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న అధికారులు

కణేకల్లు: స్థానిక ఓ బియ్యం వ్యాపారి ఇంట్లో భారీగా రేషన్ బియ్యం డంప్ బయటపడింది. అక్కడి నిల్వలు చూసి ఏకంగా విజిలెన్స్ అధికారులే కంగుతిన్నారు. వివరాలు... కణేకల్లులోని రామనగర్‌లో నివాసముంటున్న బియ్యం వ్యాపారి గవిరాజు ఇంటిని శుక్రవారం రాత్రి విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఇంట్లో రెండు గదుల్లో భారీ స్థాయిలో పేర్చిన రేషన్ బియ్యం బస్తాలను గమనించి విజిలెన్స్ సీఐ జమాల్‌బాషా, డిప్యూటీ తహసీల్దార్ విశ్వనాథ్, ఆర్‌ఎస్ డిప్యూటీ తహసీల్దార్ విజయకుమార్‌నాయక్, స్థానిక వీఆర్వో పవన్‌కుమార్ ఒక్కసారిగా నిశ్చేష్టులయ్యారు. 20, 30, 40 కిలోల లెక్కన బస్తాలుండటంతో మొత్తం ఎన్ని క్వింటాళ్ల బియ్యం ఉందో లెక్కించడం సాధ్యం కాక, చివరకు ఓ లారీని రప్పించి అందులో లోడ్ చేసి ఎఫ్‌సీఐ గోదాముకు తరలించారు. గవిరాజుపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.

ట్రాక్టర్ ట్రాలీ కింద పడి రైతు మృతి

- మృతుడు వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత


ఆదినారాయణ రెడ్డి (ఫైల్)

రాప్తాడు: ట్రాక్టర్ ట్రాలీ ఉన్నఫళంగా కిందకు దిగడంతో దాని కింద చిక్కుకుని ఓ రైతు దుర్మరణం పాలయ్యాడు. వివరాలు... రాప్తాడు మండలం బుక్కచెర్ల గ్రామానికి చెందిన బెంచి ఆదినారాయణరెడ్డి అలియాస్ ఆదిరెడ్డి (53)కి భార్య లలిత, ఇద్దరు కుమారులు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో చురుకైన నాయకుడిగా కొనసాగుతూ వచ్చిన ఆయనకు ముగ్గురు అన్నలు, ఓ తమ్ముడూ ఉన్నారు. అన్నదమ్ముల కుటుంబాలకూ ఆయనే పెద్దదిక్కుగా ఉంటూ వస్తున్నారు. గ్రామ శివారులోని చెరువు వద్ద తనకున్న 15 ఎకరాల పొలంలో అరటి, దానిమ్మ, చీనీ, వేరుశనగ పంటలను సాగు చేస్తున్న ఆయన వ్యవసాయంపై మక్కువతో తోటలోనే ఇల్లు నిర్మించుకుని అక్కడే నివాసముంటూ వస్తున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి తోటకు వెళ్లే రస్తాపై నీరు నిలబడింది. దీంతో ఎర్రమట్టిని తోలి రస్తాను బాగుచేయాలని భావించిన ఆయన శుక్రవారం ఉదయం బుక్కచెర్లకు చెందిన ప్రకాష్‌రెడ్డి జేసీబీతో తన తోట సమీపంలోని గుట్ట నుంచి ఎర్రమట్టిని తానే ట్రాక్టర్‌లో తీసుకెళ్లి రస్తాపై అన్‌లోడ్ చేశాడు. మట్టి అంతా కిందకు వచ్చిన ట్రాలీ లిఫ్ట్ కిందకు దిగలేదు. దీంతో ట్రాలీ లిఫ్ట్ వైరు వద్ద ఎయిర్ (గాలి) తీయాలని అక్కడే ఉన్న తన భార్య లలితకు సూచించాడు. ఎంత ప్రయత్నించినా ఆమెకు సాధ్యం కాకపోవడంతో చివరకు ట్రాక్టర్ దిగి తానే వెళ్లి ఎయిర్ తీస్తుండగా ఒక్కసారిగా ట్రాలీ కిందకు వాలడంతో దాని కింద ఆదిరెడ్డి చిక్కుకుపోయాడు. త్రుటిలో తప్పించుకున్న లలిత గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల పొలాల్లో ఉన్న రైతులు అక్కడకు చేరుకుని జేసీబీ సాయంతో లిఫ్ట్‌ను పైకి ఎత్తారు. అప్పటికే తల ఛిద్రమై ఆదిరెడ్డి మృతి చెందాడు. కళ్ల ఎదుటే భర్త మృతి చెందడంతో లలిత ఇక తమకు దిక్కెవరంటూ అన్నదమ్ములు రోదించిన తీరు అక్కడున్న వారిని కలిచివేసింది. ఘటనపై సీఐ టీవీ శ్రీహర్ష కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

హెచ్‌ఆర్సీ, లోకాయుక్త తరలింపు ఆపాలి

- అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి డిమాండ్
- లేదంటే ఉద్యమం తప్పదని హెచ్చరిక

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్సీ), లోకాయుక్తను అమరావతికి తరలించడాన్ని వెంటనే ఆపాలని, లేదంటే మరోమారు రాయలసీమ ఉద్యమం ఉవ్వెత్తున లేస్తుందని అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి హెచ్చరించింది. ఈ మేరకు సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రమణ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అధికార వికేంద్రీకరణ ద్వారానే ఏ రాష్ట్రంలోనైనా ప్రాంతాల మధ్య అసమానతలు తొలిగిపోతాయన్నారు. శ్రీబాగ్ ఒప్పందం, శ్రీకృష్ణ, శివరామకృష్ణన్, బోత్సన్ కమిటీ నివేదికలు ఇదే విషయాన్ని స్పష్టం చేశాయని గుర్తు చేశారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో వెనుకబడిన ప్రాంతాలు, ముఖ్యంగా అత్యంత వెనుకడిన రాయలసీమ పరిస్థితి దారుణంగా మారిందన్నారు. నవ్యాంధ్రప్రదేశ్‌కు తొలిసారి అధికారంలోకి వచ్చిన టీడీపీ... అమరావతి అభివృద్ధే యావత్తు రాష్ట్ర అభివృద్ధిగా మొండిగా పాలన సాగించిందన్నారు. తద్వారా రాష్ట్ర సమగ్రాభివృద్ధి కాదుకదా అమరావతి కూడా అభివృద్ధి జరగలేదన్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ మూడు ప్రాంతాలను సమాన అభివృద్ధి చేయాలనే నినాదాన్ని ఎత్తుకుని నిజాయితీగా ప్రయత్నం చేసిందన్నారు. తగినంత సమయం, నిధులు లేకపోవడం, కోర్టులో వ్యాజ్యాల కారణంగా కార్యరూపం దాల్చలేదన్నారు. వికేంద్రీకరణలో భాగంగా గత ప్రభుత్వం కర్నూలులో హైకోర్టు, న్యాయ అకాడమి, లోకాయుక్త, హెచ్‌ఆర్సీ ఏర్పాటు చేయాలని చిత్తశుద్ధితో ప్రయత్నం చేసిందన్నారు. కొందరు కోర్టుల్లో వ్యాజ్యం వేసిన కారణంగా హైకోర్టు, లా అకాడమి ఏర్పాటు కార్యరూపం దాల్చలేదన్నారు. తిరిగి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాయలసీమ నుంచి హెచ్‌ఆర్సీ, లోకాయుక్తను అమరావతికి తరలించే దుర్మార్గానికి పూనుకుందని మండిపడ్డారు. రాష్ట్రం మరోసారి చీలిక కాకుండా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు.

ఆన్‌సెట్ సీఈఓ బాధ్యతల స్వీకరణ

అనంతపురం కల్చరల్: ప్రస్తుతం పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వెంకటేశ్వర్లు జిల్లా యువజన సంక్షేమ శాఖ (ఆన్‌సెట్) సీఈఓగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువతకు ఉజ్వల భవిష్యత్తు కల్పించేందుకు ప్రభుత్వ పథకాలను మరింత విస్తృతంగా అమలయ్యేలా చూస్తామన్నారు.

రైల్వే పనులకు కేటాయించిన భూముల పరిశీలన

గుత్తి: స్పెషల్ రైల్వే ప్రాజెక్ట్ కింద పెండేకల్లు–గుత్తి మధ్య చేపట్టనున్న డబుల్ లైన్ పనుల కోసం కేటాయించిన భూములను శుక్రవారం జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ పరిశీలించారు. చెట్నేపల్లి సమీపంలోని భూములతో పాటు గుత్తిలో అహుడాకు కేటాయించిన భూముల వివరాలపై ఆయన ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఓబులేసు, రైల్వే సెక్షన్ ఆఫీసర్ విమలేష్ కుమార్, సర్వేయర్ శేషసాయి, వీఆర్వోలు వాల్మీకి సురేంద్ర, రాజేష్ పాల్గొన్నారు.

మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలి

- ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్ ఆర్గనైజేషన్


ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివానందరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్ ఆర్గనైజేషన్ (ఫోర్టో) నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో ఫోర్టో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఫోర్టో రాష్ట్ర చైర్మన్ కరణం హరికృష్ణ, గౌరవ సలహాదారు గాండ్లపర్తి శివానందరెడ్డి మాట్లాడుతూ... పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కరువు భత్యం బకాయిలు, గత పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మేనేజ్‌మెంట్ వారీగా ఉపాధ్యాయులకు పదోన్నతులు చేపట్టాలన్నారు. ఏపీజీఎల్ఐసీ, పీఎఫ్ లోన్లు, ఆర్జిత సెలవుల మంజూరుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇటీవల ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన గాండ్లపర్తి శివానందరెడ్డిని సన్మానించారు. సమావేశంలో ఫోర్టో జిల్లా సెక్రటరీ జనరల్ గాలి వెంకటనారాయణరెడ్డి, నాయకులు ఆదిశేషయ్య, వేణుగోపాల్, పీవీ శ్రీనివాసులు, నరసింహారెడ్డి, ప్రభాకర్, కేశవమూర్తి, గోపాల్‌రెడ్డి, క్రిష్టప్ప, శివయ్య, డెగావంత్ రవీంద్రనాథ్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా ఫోర్టో చైర్మన్‌గా శ్రీనివాసులు, గౌరవాధ్యక్షులుగా ఎం.లక్ష్మీనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పెను గాలులకు నేలకొరిగిన మొక్కజొన్న


పుట్లూరు మండలం సూరేపల్లిలో దెబ్బతిన్న మొక్కజొన్న పంట

పుట్లూరు: గురువారం రాత్రి పెనుగాలులతో కూడిన వర్షం కారణంగా పుట్లూరు మండలం ఆరకటివేముల, సూరేపల్లి, కడవకల్లు, చింతకుంట, కందికాపుల, సంజీవపురం, గొల్లపల్లి గ్రామాల్లో దాదాపు 80 మంది రైతులకు చెందిన 600 ఎకరాల్లో మొక్కజొన్న పంట నేలవాలింది. గతంలో కంటే ఈ ఏడాది మొక్కజొన్న ఏపుగా పెరిగి అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. మరో 20 రోజుల్లో చేతికందే పంట మొత్తం తుడిచిపెట్టుకుపోవడంతో కనీస పెట్టుబడులు సైతం చేతికి అందే పరిస్థితి లేదు. ఎకరాకు రూ.30వేల చొప్పున రూ.1.8కోట్ల మేర నష్టం వాటిలినట్లుగా తెలుస్తోంది. మొక్కజొన్నతో పాటు మరో 50 ఎకరాల్లో సాగు చేసిన జొన్న పంట కూడా నష్టపోయింది. సమాచారం అందుకున్న వ్యవసాయాధికారులు, రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ఆయా గ్రామాల్లో పర్యటించి పంట నష్టాలను పరిశీలించారు. సీనియర్ శాస్త్రవేత్త నారాయణస్వామి మాట్లాడుతూ... మొక్కజొన్న పొలాల్లో చేరుకున్న నీటిని తొలగించిన 48 గంటల తర్వాత హెక్టారుకు 5 కిలోల పొటాషియం నైట్రేట్‌ను పిచికారీ చేయడం ద్వారా పంటను కాపాడుకోవచ్చునన్నారు. వర్షం కారణంగా మొక్కజొన్నలో కత్తెర పురుగు ఉధృతి పెరిగే అవకాశం ఉందని, నివారణకు స్పైనటోరం మందును ఎకరాకు 100 ఎం.ఎల్. చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కిషోర్‌రెడ్డి, ఏఓ కాత్యాయిని, ఏఈఓ హరి, వీహెచ్‌ఏ ఆదినారాయణ పాల్గొన్నారు.

మా నాన్నను కాపాడండి

- రెండేళ్ల క్రితం పాము కాటుతో తల్లి మృతి
- రెండు రోజుల క్రితం ప్రమాదంలో తండ్రికి తీవ్ర గాయాలు
- తండ్రిని కాపాడాలంటూ సామాజిక మాధ్యమాల్లో చిన్నారుల వేడుకోలు


తండ్రిని కాపాడాలంటూ వేడుకుంటున్న చిన్నారులు

కంబదూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో బెంగళూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తమ తండ్రిని బతికించాలంటూ ముగ్గురు చిన్నారులు వేడుకుంటున్నారు. సామాజిక మాధ్యమాల్లో ఈ అంశం వైరల్ అవుతోంది. వివరాలు... కంబదూరు మండలం తిమ్మాపురం గ్రామ ఎస్సీ కాలనీలో నివాసముంటున్న నారాయణ, శిల్ప దంపతులు కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. వీరికి ఏడేళ్ల వయసున్న చార్విక్, ఐదేళ్ల వయసున్న తన్విక్ అనే కుమారులతో పాటు, మూడేళ్ల వయసున్న కృతిక అనే కుమార్తె ఉంది. రెండేళ్ల క్రితం కూలి పనులకు వెళ్లిన శిల్ప పాము కాటుతో మృతి చెందింది. అప్పటి నుంచి పిల్లల ఆలనాపాలన మొత్తం తండ్రి నారాయణే చూసుకుంటున్నాడు. గురువారం అస్వస్థతకు గురైన కుమార్తె కృతికను చికిత్స కోసం కళ్యాణదుర్గంలోని ఆస్పత్రికి పిలుచుకెళుతుండగా బోయిలపల్లి శివారులో గేదె అడ్డుగా రావడంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. ఘటనలో చిన్నపాటి గాయంతో కృతిక బయటపడింది. తీవ్రంగా గాయపడిన నారాయణను బంధువులు వెంటనే అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి వైద్యుల సూచన మేరకు బెంగళూరులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించారు. మెదడులో రక్తం చిట్లి గడ్డ కట్టడంతో శస్త్ర చికిత్స చేయాలని, ఇందుకు రూ.2 లక్షల ఖర్చు అవుతుందని, ఆపరేషన్ అనంతరం 10 నుంచి 15 రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలోనే ఉండాల్సి వస్తుందని, దీనికి అదనంగా రూ.3 లక్షల వరకు ఖర్చు వస్తుందని అక్కడి వైద్యులు తెలిపారు. ఓ వైపు తల్లి లేదు... మరోవైపు తండ్రి కనిపించకపోవడంతో 'నాన్నకు ఏమైంది. ఎవరైనా మా నాన్నను కాపాడండి' అంటూ కనిపించిన ప్రతి ఒక్కరినీ చిన్నారులు వేడుకుంటున్నారు. ఈ అంశం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దాతలు ఎవరైనా స్పందించి సాయం చేయదలిస్తే 96523 63800, 63005 23727 నంబర్లకు ఫోన్‌పే ద్వారా ఆర్థిక సాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రశాంతి నిలయంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు

ప్రశాంతి నిలయం: సత్యసాయి జయంతి వేడుకల సందర్భంగా దేశ విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ప్రశాంతి నిలయానికి తరలిరానున్నారు. భక్తుల భద్రత దృష్ట్యా ప్రశాంతి నిలయంలో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఎస్పీ వి.రత్న తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఎస్పీ సత్యసాయి విమానాశ్రయం, ప్రశాంతి నిలయం ప్రవేశ ద్వారాలు, సాయికుల్వంత్ సభా మందిరం, పూర్ణచంద్ర ఆడిటోరియం, శాంతిభవన్ అతిథి గృహం, మహానారాయణ సేవ నిర్వహించే మైదానంతో పాటు ప్రశాంతి నిలయంలోని అన్ని ప్రాంతాలను పరిశీలించారు. భద్రతా చర్యలపై పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. సత్యసాయి జయంత్యుత్సవాల్లో ఎలాంటి లోపాలకు తావివ్వకూడదన్నారు. అనంతరం ప్రశాంతి నిలయంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజును కలసి వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీ విజయ్ కుమార్, ఏఆర్ డీఎస్పీ జెడ్ విజయకుమార్ పాల్గొన్నారు.

బి.యాలేరులో 'తమ్ముళ్ల' అరాచకం


వైఎస్సార్ విగ్రహం చేయిని పగులగొట్టిన దృశ్యం


ధ్వంసమైన శిలాఫలకం


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్ విగ్రహం, ప్రభుత్వ శిలాఫలకాల ధ్వంసం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: జిల్లాలో టీడీపీ నాయకుల అరాచకాలు శ్రుతిమించాయి. ప్రభుత్వ ఆస్తుల విధ్వంసాన్ని కొనసాగిస్తున్నారు. ఆత్మకూరు మండలం బ్రాహ్మణయాలేరు గ్రామంలో గురువారం రాత్రి దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం కుడి చేతిని పగులగొట్టారు. అలాగే గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం శిలాఫలకాలను ధ్వంసం చేశారు. ఎన్నికల సమయంలో గ్రామంలోని ప్రధాన రహదారిలో అధికారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. కొద్ది రోజుల క్రితం వాటిని తొలగించారు. ఇదే అదనుగా భావించిన టీడీపీ నాయకులు ముందుగా ప్రధాన రహదారిలోని వైఎస్సార్ విగ్రహం చేయిని విరగ్గొట్టారు. తర్వాత సచివాలయం, ఆర్బీకే శిలాఫలకాలపై గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గత ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్లు ఉన్నాయన్న అక్కసుతో వాటినీ పగులగొట్టి విధ్వంసం సృష్టించారు. ఇన్నాళ్లు ప్రశాంతంగా ఉన్న గ్రామంలో టీడీపీ నేతలు విధ్వంసం సృష్టించడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో కక్షలు రేపేలా ప్రవర్తిస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని ఆత్మకూరు ఎంపీపీ హేమలత, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల కన్వీనర్ కొండారెడ్డి, నాయకులు శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వైఎస్సార్ విగ్రహం, ప్రభుత్వ భవనాల శిలాఫలకాల ధ్వంసం ఘటనలో అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కుమ్మరి చిన్నా పాత్ర ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వర‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీ మహేష్, ఎర్రిస్వామి, నాగరాజు, నరసింహులు, ఈశ్వరయ్య, శివారెడ్డి, ఎర్రి ఈశ్వరయ్య పాల్గొన్నారు. కాగా.. కుమ్మరి చిన్నా అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

శెట్టూరు: క్షణికావేశంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.... శెట్టూరు మండలం గంటయ్యదొడ్డి గ్రామానికి చెందిన బోయ శివన్న, తిమ్మక్క దంపతుల కుమారుడు శివ (24) ఈ నెల 12న మద్యం మత్తులో ఇంటికి చేరుకున్నాడు. ఆ సమయంలో తల్లి మందలించింది. తాగుడుకు బానిసైతే జీవితం బుగ్గి పాలవుతుందని, బుద్ధిగా ఏదైనా పని చేసుకుని బతకాలని హితవు పలికింది. దీంతో క్షణికావేశానికి లోనైన శివ... అదే రోజు తన శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే మంటలు ఆర్పి కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక శుక్రవారం ఉదయం శివ మృతి చెందాడు. ఘటనపై ఎస్ఐ రాంభూపాల్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కార్తీకం.. దేదీప్యమానం



మొక్కులు చెల్లించుకుంటున్న యువతులు

- భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు
- మార్మోగిన శివ నామస్మరణ

అనంతపురం కల్చరల్/అనంతపురం సిటీ/రాప్తాడు/ఆత్మకూరు: కార్తీక పౌర్ణమి పర్వదినం రాకతో ఆలయాలు జ్వాలాదీప తోరణాల నడుమ కళకళలాడాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథ ఆలయంలో కోటి దీపోత్సవం, అన్నదానం జరిగింది. పాతూరులోని పురాతన బీరప్పగుడి స్వామి ఆలయంలో కనకదాస ఉపాధ్యాయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో లక్షదీపోత్సవం ఘనంగా జరిగాయి. మొదటి రోడ్డులోని కాశీ విశ్వేశ్వరాలయంలో అంగరంగ వైభవంగా కార్తీక దీపారాధన చేపట్టారు. వందలా మంది మహిళలు బారులు తీరి దీపాలు వెలిగించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మహేశ్వరుడికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, అర్చన, రుద్రం, చమకం, సామూహిక బిల్వార్చన చేశారు. గీతామందిరం, మారుతీ నగర్‌లోని శివాలయం, అరవింద నగర్‌లోని సర్వేశ్వరాలయం, హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథ ఆలయ పరిసరాల్లో కార్తీక సందడి నెలకొంది. ఇక రాప్తాడులోని నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా అన్నాభిషేకం, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు, అభిషేకాలు, అర్చనలు శాస్త్రోక్తంగా జరిగాయి. అంతకుముందు మహిళలు ఆలయం వద్ద దీపాలు వెలిగించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ప్రసన్నాయపల్లి పంచాయతీ చిన్మయనగర్‌లో వెలసిన గౌరి ప్రసన్నేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందడి నెలకొంది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు మహాశివుడి నామస్మరణతో మార్మోగాయి. అనంతరం ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగించారు. కోటి దీపోత్సవం, జ్వాలా తోరణ మహోత్సవం నిర్వహించారు. ఆత్మకూరు మండలం పంపనూరులోని మంజునాథ స్వామికి అభిషేకాలు చేశారు. సనప గ్రామంలో రామలింగేశ్వర స్వామి, ఆత్మకూరులో భైరవేశ్వర స్వామి, శివాలయంలో ఈశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అలాగే అనంతపురం చెరువు కట్ట కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో జరిగిన పూజల్లో ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైస్ చైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ పాల్గొన్నారు. కార్తీక దీపాలు వెలిగించి, మొక్కులు చెల్లించుకున్నారు.



రాప్తాడు: చిన్మయనగర్‌లో గౌరి ప్రసన్నేశ్వర స్వామి ఆలయంలో దీపారాధన



మంజునాథేశ్వర ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ



మొదటి రోడ్డు శివాలయంలో కార్తీక సందడి



హెచ్చెల్సీ కెనాల్‌లో దీపాలు వదులుతున్న దృశ్యం



ఆత్మకూరు: కార్తీక దీపాలు వెలిగిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ బాలగంగాధర్

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక రుద్రంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు నిర్వహించారు. సహకార సంఘాల్లో నూతన ఆవిష్కరణలు, సాంకేతిక, సుపరిపాలన అనే అంశంపై చర్చాగోష్టి నిర్వహించారు. సహకార సంఘాల సేవలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రైతులకు అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్రాంచి మేనేజర్ అనంతలక్ష్మి, సహకార శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ జి.రమాదేవి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బాలగంగాధర్, సొసైటీ సీఈఓ పి.హనుమంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు వసూలు చేయాలి

అనంతపురం కార్పొరేషన్: కొత్తూరు, పాతూరు నగరపాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఏళ్ల తరబడి పేరుకుపోయిన మొండి బకాయిలను తక్షణం వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ నాగరాజు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని పాతూరు, కొత్తూరు నగరపాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్‌లను ఆయన పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన షాపులకు మరమ్మతులు చేయించాలన్నారు. షాపులు అద్దెకు తీసుకున్న వారు నిబంధనలకు లోబడి బకాయిలు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఆర్ఓ సతీష్, ఆర్ఐ మురళీ, ఈఈ షాకీర్, తదితరులు పాల్గొన్నారు.

నబీరసూల్‌కు నెహ్రూ జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న నబీరసూల్

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన సీనియర్ కవి కంబదూరు నబీరసూల్ మరో జాతీయ అవార్డు స్వీకరించారు. బాలల దినోత్సవం సందర్భంగా మనం ఫౌండేషన్ వారు రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న వారికి హైదరాబాద్‌లో జాతీయ అవార్డులు అందజేశారు. మాజీ కేంద్ర మంత్రి సముద్రాల రాఘవాచారి, దైవజ్ఞ శర్మ, కటకం భాస్కర్, మనం సంస్థ చైర్మన్ చక్రవర్తి చేతుల మీదుగా నబీరసూల్ ప్రశంసాపత్రం, పురస్కారం అందుకున్నారు.

'ఎస్సీ వర్గీకరణపై చంద్రబాబు మోసం చేస్తున్నారు'

అనంతపురం టవర్‌క్లాక్: ఎస్సీ వర్గీకరణ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోసారి మోసం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కృపాకర్ మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌జే ప్రకాష్ మాదిగ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణకు కృషి చేసిన నాయకులకు సత్కార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 30 ఏళ్ల ఎమ్మార్పీఎస్ ఉద్యమ ఫలితంగా నేడు ఎస్సీ వర్గీకరణకు అవకాశం లభించిందన్నారు. ఎస్సీల్లో మాల, మాదిగ ఇతర కులాలు ఉన్నాయని.. ఫలాలు మాత్రం కేవలం మాలలకు మాత్రమే అందుతున్నాయన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన వెంటనే పక్క రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక కమిటీ వేశారన్నారు. మన రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ఇంత వరకూ ఏ కమిటీ వేయలేదని మండిపడ్డారు. చంద్రబాబు మాదిగల పక్షాన ఉన్నట్లు ఉంటూనే మాలలకు సహకరిస్తున్నారని ఆరోపించారు. హక్కుల సాధనకు మాదిగలు మరోసారి పోరాటాలు మొదలు పెట్టాలన్నారు. ఆర్‌జే ప్రకాష్ మాదిగ మాట్లాడుతూ.. ఎంతో మంది త్యాగ ఫలితంగా ఎస్సీ వర్గీకరణ సాధించామన్నారు. అయితే కొన్ని పార్టీలకు అమ్ముడుబోయిన వారిని సన్మానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అక్కులప్ప మదిగ, కేపీ నారాయణ స్వామి, ఆనంద్, రమేష్ సుంకన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

న్యాయం చేయండి

అనంతపురం రూరల్: తమ స్థలాలను ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్న వారిని నుంచి మమల్ని రక్షించి మాకు న్యాయం చేయాలని జన్మభూమి రోడ్డులో నివాసం ఉంటున్న రజకులు సుంకన్న, రామక్క, నరసింహులు కోరారు. శుక్రవారం బాధితులకు మద్దతుగా రజక సంఘం నాయకులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. రజక సంఘం నాయకులు మీసాల రంగన్న, న్యాయవాది హనుమన్న మాట్లాడారు. అనంతపురం టౌన్ సర్వే నంబర్ 2165-1 నలభై సంవత్సరాల క్రితం ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసిందన్నారు. అప్పటి నుంచి అక్కడే నివాసం ఉంటున్నామన్నారు. అయితే ఈ భూమితో సంబంధం లేని హుస్సేన్, టీడీపీ నాయకులు ఆ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. రెండు రోజుల క్రితం జేసీబీలతో బండలను పగులగొట్టి, భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

యాంటీబయాటిక్స్ వాడకం తగ్గించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: చిన్నారులకు యాంటిబయాటిక్స్ అధిక మోతాదులో ఇవ్వొద్దు. యాంటిబయాటిక్స్ వాడకం తగ్గించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. శుక్రవారం సర్వజనాస్పత్రిలోని సర్జికల్ విభాగంలో జాతీయ నవజాత శిశు సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా నవజాత శిశువులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. పసికందులకు వ్యాప్తి చెందే వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. సర్వజనాస్పత్రిలో పసికందులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. యాంటీ బయాటిక్స్ అతిగా వాడకంతో దుష్పరిణామాలు చోటుచేసుకునే అవకాశం లేకపోలేదన్నారు. ఈనెల 15వ తేదీ నుంచి 21వ తేదీ వరకూ వారం రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా నవజాత శిశువుల సంరక్షణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవీన్ కుమార్, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, తదితరులు పాల్గొన్నారు.

మంచి నాయకుడిని కోల్పోయాం



ఆదిరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి

రాప్తాడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చురుకైన సీనియర్ నాయకుడిని కోల్పోయామని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ఆయన సోదరుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మండలంలోని బుక్కచెర్ల గ్రామంలో బెంచి ఆదినారాయణ అలియాస్ ఆది రెడ్డి తన వ్యవసాయ తోటలో ట్రాక్టర్ ట్రాలీ కిందపడి మృతి చెందడం బాధాకరమన్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ఆయన సోదరుడు రాజశేఖర్ రెడ్డి గ్రామానికి చెరుకుని ఆదిరెడ్డి మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆదిరెడ్డి భార్య లలిత, కుమారులు నరేంద్ర రెడ్డి, సురేంద్ర రెడ్డి, మృతుడి అన్నలు వెంకట్ రెడ్డి, నల్లప రెడ్డి, పెద్దిరెడ్డి, తమ్ముడు రఘునాథ్ రెడ్డిని పరామర్శించారు. ఏ సమస్య వచ్చినా తోపుదుర్తి కుటుంబంతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, మాజీ యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, నాగేంద్ర రెడ్డి, వీఆర్వో పురుషోత్తం రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యదేవుడి వ్రతం





పంపనూరులో సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్న అర్చకులు, వ్రతం ఆచరిస్తున్న దంపతులు

అనంతపురం కల్చరల్: కార్తీక పౌర్ణమి రాకతో నగరంలోని పలు ఆలయాల్లో సత్యనారాయణ స్వామి వ్రతాలు పెద్ద ఎత్తున జరిగాయి. అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు బారులు తీరి సంప్రదాయబద్ధంగా వ్రతం ఆచరించారు. స్థానిక అశోక్ నగర్‌లోని సత్యనారాయణ స్వామి ఆలయాన్ని ప్రత్యేక దీపాలతో అలంకరించారు. స్వామి వారి వ్రతాన్ని నియమనిష్టలతో జరిపించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధులు ఫణిరాజ్, తిరువీధుల జగదీష్, వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి నిత్యం స్వామి వారి వ్రతాలు అన్నవరంలో మాదిరిగా జరిపిస్తున్నామన్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఏకంగా 300 వ్రతాలు జరగడం విశేషమన్నారు. అలాగే మూడవ రోడ్డు సాయిబాబా మందిరం, వేమనా టెలీభవన్ ఎదురుగా ఉన్న షిర్డీ సాయిబాబా మందిరం, మారుతీ నగర్‌లోని తదితర చోట్ల సామూహిక సత్యదేవుని వ్రతాలు జరిగాయి.

పంపనూరులో..

ఆత్మకూరు: కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. తొలుత స్వామికి స్వర్ణ కవచ సేవ చేపట్టారు. ఆదివారం కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీనరసింహ తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయంలో పారిశుధ్య పనులు చేయించారు. వాహనాల పార్కింగ్‌కు జేసీబీతో పరిసరాలను శుభ్రం చేయించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ బాబు, పంచాయతీ సెక్రటరీ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

డీఏ బకాయిలు విడుదల చేయాలి



సమావేశంలో పాల్గొన్న పీఆర్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి డీఏ (కరువు భత్యం) బకాయిలు విడుదల చేయాలని ప్రొగ్రెస్సివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు టి.పురుషోత్తంరెడ్డి అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.... 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించడంతో పాటు పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 117 జీఓను రద్దు చేసి 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల నుంచి పూర్వ ప్రాథమిక పాఠశాలలకు పంపాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి 20 మంది విద్యార్థులకు ఒకరు, 60 మంది వరకు ఇద్దరిని మాత్రమే హేతుబద్ధీకరణ ద్వారా ఉపాధ్యాయులను కేటాయించడంలో శాస్త్రీయత లోపించిందన్నారు. 41 మంది విద్యార్థులు దాటితే మూడో ఉపాధ్యాయుడిని నియమించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఏలు, ఎస్జీటీలను ఎప్పటికప్పుడు మార్చడం సరికాదన్నారు. అపార్ నమోదులో అవరోధాలను తొలగించాలన్నారు. టీచర్లకు రెసిడెన్షియల్ శిక్షణలను రద్దు చేసి నాన్ రెసిడెన్షియల్ శిక్షణలు ఇచ్చేలా చూడాలన్నారు. సమావేశంలో పీఆర్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి జి.తిమ్మారెడ్డి, సీనియర్ నాయకులు ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి, టి.చంద్రశేఖర్‌రెడ్డి, ఎ.కేశవరెడ్డి, వైసీ ప్రసాద్‌రెడ్డి, పి.హనుమంతరెడ్డి, బి.వేమారెడ్డి, ఎస్.రామ్మూర్తి, ఎస్.రామ్మోహన్‌రెడ్డి, కె.యల్లప్ప, ఎస్.లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తికి బెదిరింపు కాల్స్

అనంతపురం: నగరంలోని కురబ వీధికి చెందిన చెన్నూరు నాగార్జున అనే వ్యక్తికి అపరిచితుల ఫోన్ నంబర్ల నుంచి పలుమార్లు బెదిరింపు కాల్స్ వచ్చినట్లు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. బాధితుడు చెన్నూరు నాగార్జున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అనంతపురం: ద్విచక్ర వాహనాలను అపహరించి, సొమ్ము చేసుకుంటున్న ఓ యువకుడిని అనంతపురం నాల్గో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను శుక్రవారం సీఐ కె.సాయినాథ్ వెల్లడించారు. ఇటీవల అనంతపురంలోని రామచంద్రనగర్‌లోని సాయిబాబా గుడి వద్ద పల్సర్ బైక్‌తో పాటు కళ్యాణదుర్గం బైపాస్ సమీపంలోని ఓలా సర్వీస్ సెంటర్ వద్ద పార్క్ చేసిన రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ బైక్ అపహరణకు గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన నాల్గో పట్టణ పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం అనంతపురంలోని చంద్రబాబు కొట్టాల సర్కిల్ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని అమ్మబోతున్న కనగానపల్లి మండలం భానుకోటకు చెందిన భూపతి తీరుపై అనుమానం రావడంతో అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో ద్విచక్ర వాహనాల అపహరణ వెలుగులోకి వచ్చింది. నిందితుడి నుంచి రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

నగరంలో భారీ వర్షం

- రాంనగర్ ఫ్లైఓవర్‌కు ఆనుకుని నిలిచిన నీరు
- భయాందోళనకు గురైన ప్రజలు
- స్తంభించిన రాకపోకలు



పూడికతీత పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం



రాంనగర్ ఫ్లైఓవర్ వద్ద వర్షపు నీటిలో వాహనదారుల అవస్థలు

అనంతపురం కార్పొరేషన్: నగరంలో డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉండడంతో నగరావసులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు శుక్రవారం రాంనగర్‌ను వరద చుట్టుముట్టింది. వర్షపు నీరు రావడంతో కాలువలు బ్లాక్ అయ్యాయి. దీంతో ఒక్కసారి మురుగు రోడ్డుపై వచ్చేసింది. దీంతో పాటుగా వరద నీరు అంబేడ్కర్ ఫ్లైఓవర్‌ను ఆనుకుని నిలిచిపోయింది. వాహనాల రాకపోలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రజలు తీవ్ర భయాందోనకు గురయ్యారు. ఏమాత్రం ఏమరపాటు ఉన్నా వరదలో కొట్టుకునే పోయే ప్రమాదం లేకపోలేదు. కార్లు నెమ్మదిగా వెళ్లాల్సి వచ్చింది. బైక్‌లపై వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వాహనదారులు ఆటోలు, బైక్‌లను తోసుకుని వెళ్లాల్సి వచ్చింది.

ఇళ్ల ముందు నిలిచిన మురుగు

రాంనగర్‌లో అవసరం ఉన్న కొన్ని ప్రాంతాల్లో కల్వర్టులు, కాలువలను విస్తరించకపోవడంతో కాలువలు బ్లాక్ అయ్యాయి. దీంతో రాంనగర్, మంగళవారి కాలనీ, వెంకట్రావ్ నగర్ ప్రాంతాల్లో మురుగు ఇళ్ల ముందుకు వచ్చేసింది. మురుగులో అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. మహిళలు స్వయంగా బకెట్లతో మురుగు తొలగించుకున్నారు.

నిద్రమత్తులో కమిషనర్..

రాంనగర్‌ను వరద చుట్టుముడితే నగరపాలక సంస్థ కమిషనర్ నాగరాజు స్పందించ లేదు. కమిషనర్ నిద్రమత్తులో ఉన్నారన్న విమర్శలు తలెత్తుతున్నాయి. వరద నీరు రాంనగర్‌ను చుట్టుముడితే అటువైపు కమిషనర్ తొంగి చూడకపోవడం గమనార్హం. స్థానికంగా ఉండే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి.. ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తికి ఫోన్ చేస్తే ఆయన ఆలస్యంగా అక్కడకు జేసీబీ పంపి సహాయ చర్యలు చేపట్టేలా చూశారు. ప్రజలు ప్రత్యక్ష నరకం చూస్తున్న సకాలంలో జేసీబీ, తదితర వాహనాలను పంపి పూడికతీత పనులు చేపట్టే ప్రయత్నం చేయలేదు.

అప్రమత్తంగా ఉండాలి

అనంతపురం కార్పొరేషన్: వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండి పూడికతీత పనులపై ప్రత్యేక దృష్టిసారించాలని మేయర్ వసీం పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. కాలువల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతోనే వర్షాలకు మురుగు రోడ్డుపైకి వచ్చిందని తెలిపారు. ఇంజినీర్లు, ప్రజారోగ్యాధికారుపై అసహనం వ్యక్తం చేశారు. కొన్ని ప్రాంతాల్లో ప్రజల ఇళ్లలోకి నీరు చేరిందని పేర్కొన్నారు. మరోసారి ఇటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మేయర్ వెంట కార్పొరేటర్ కమల్‌భూషణ్, ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్ర రెడ్డి తదితరులు ఉన్నారు.

కోగిర జై సీతారాంకు ఘన నివాళి



కోగిర చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కవులు, రచయితలు

అనంతపురం కల్చరల్: అనంత జిల్లా సాహిత్యంతో ఎనలేని బంధం ఏర్పరుచుకున్న కోగిర జై సీతారాం సాహితీ సేవలు ఆదర్శప్రాయమని విప్లవ కవి జెట్టీ జైరాం అన్నారు. కోగిర శతజయంతి వేడుకల సందర్భంగా గురువారం స్థానిక విశాలాంధ్రబుక్ హౌస్ ప్రాంగణంలో కోగిరకు పలు సాహితీ సంస్థల ప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. జెట్టీ జైరామ్‌తో పాటూ సీనియర్ కవులు టీవీరెడ్డి, జయరాములు, తదితరులు మాట్లాడుతూ.. కవికాకిగా ప్రసిద్ధులైన కోగిర రచనలు అనంత మాండలికానికి దర్పణం పట్టాయన్నారు. ఆయన కవితలు, కథలు, గేయాలు, పద్యాలు వేటికవే ప్రత్యేకత సంతరించుకోవడం విశేషమన్నారు. కేవలం సాహితీవేత్తగానే కాకుండా చేయితిరిగిన చిత్రకారుడిగా, తబలా విద్వాంసుడిగా అందించిన సేవలు స్ఫూర్తిని నింపినట్లు కొనియాడారు. అప్పట్లో ఆయన రచించిన అక్షర సైన్యం పుస్తకాన్ని జూనియర్ కాలేజీలో ఆవిష్కరించుకున్న సందర్భాన్ని ప్రత్యేకంగా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక నాయకులు ప్రసాద్, శ్రీనివాసులు, మస్తానప్ప తదితరులు పాల్గొన్నారు.